క్లుప్తంగా

ఓంకాళికమ్మాల్ జాతర ప్రారంభం


పుష్పాలంకరణలో అమ్మవారు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ సెలం వారిఇండ్లుకాలనీలో ఆదివారం గ్రామదేవత శ్రీఓంకాళికమ్మాల్ జాతర ఘనంగా ప్రారంభమైంది. సుందరంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, పొంగళ్లు పెట్టి నివేదించారు. ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం 9 రోజులపాటు జాతర నిర్వహించడం అనవాయితీ అని కాలనీవాసులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వరవ కాలువకు మరమ్మతులు


పనులు చేస్తున్న కూలీలు

బుచ్చినాయదుకండ్రిగ: మండలంలోని కాటూరు పంటపొలాలకు నీరందించే వరవకాలువ మరమ్మతు పనులను ఉపాధి హామీ పథకంలో చేస్తున్నారు. పనులు జోరుగా సాగుతున్నాయి. 120 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఈపనితో పాటు భూముల అభివృద్ధి పనులను చేస్తున్నారు. కూలీలకు రోజుకు రూ.180 లు కూలీ గిట్టుబాటు అవుతోందని ఫీల్డ్ అసిస్టెంట్ హరిబాబు పేర్కొన్నారు.

వార్డు సభ్యుడి మృతి

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం పంచాయతీ బలిజపాళెం వార్డు సభ్యుడు రామకృష్ణయ్య (65) ఆదివారం ఉదయం మృతి చెందారు. అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి బలిజ సంఘం సభ్యులు, సర్పంచ్, కార్యవర్గ సభ్యులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

లైంగికదాడి కేసుపై విచారణ

ఏర్పేడు: మండలంలోని గోవిందవరం ఎస్సీ కాలనీలో బాలిక(7)పై జరిగిన లైంగికదాడి కేసును తిరుపతి దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ కాటమరాజు ఆదివారం విచారించారు. మూడు రోజుల కిందట గోవిందవరం ఎస్సీ కాలనీకి చెందిన ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన బాషా మద్యం సేవించి లైంగికదాడి చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిని ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు అరెస్ట్ చేశారు.

కల్లివెట్టు గ్రామంలో మిషన్‌తో వరికోత



నెలవాయి గ్రామంలో ఆరబెట్టిన ధాన్యం



వరి చేను కోతకొచ్చింది...

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పల్లమాల, నెలవాయి, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామాల్లోని రైతులు జోరుగా వరి కోతలు కోస్తున్నారు. ఈ గ్రామాల్లో రబీసీజన్‌లో రైతులు 1,850 ఎకరాల్లో వరిపంటను సాగుచేస్తున్నారు. తుపాన్‌తో భారీ వర్షాలు పడడం, తెలుగుగంగ నీటితో చెరువులు నిండాయి. సాగునీరు సంవృద్ధిగా అందడంతో పంట కాపునకు వచ్చింది. ముందస్తుగా పంట వేసిన వారు కోత పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ దఫా పంటలకు తెగుళ్లు తక్కువని, దీంతో పెట్టుబడి ఖర్చు తగ్గిందని, ఎకరాలకు 40 బస్తాలు కనుబడి వస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యానికి మార్కెట్‌లో ధర బాగా ఉండడంతో ఎకరా పంటకు అన్ని ఖర్చులు పోను రూ.25 వేలు మిగులుతుందని రైతులు అంటున్నారు.

ఆలయ సిబ్బందికి వైద్య పరీక్షలు


వైద్యపరీక్షలు చేయించుకుంటున్న దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఆధ్వరంలోని భరద్వాజసదన్ వద్ద ఆదివారం ఎంజీఎం ఆస్పత్రి నేతృత్వంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

అన్నదానానికి బియ్యం బస్తాల వితరణ

శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి పట్టణానికి చెందిన బత్తల కిరణ్, స్వర్ణలత తమ కుమారుడు తన్విష్ జన్మదినం సందర్భంగా 50 బస్తాల బియ్యం వితరణగా అందజేశారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.


ఆలయానికి బియ్యం బస్తాలు అందజేస్తున్న దాతలు కిరణ్, స్వర్ణలత

రంజింపజేసిన నృత్య ప్రదర్శనలు



అవార్డులు అందుకున్న కళాకారులతో వైఎస్సార్‌సీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని వీవీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ప్రైడ్ ఇండియన్ కల్చర్ నృత్యోత్సవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భరత నాట్య ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేసింది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపుమధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తన నృత్య ప్రదర్శన చూసిన తల్లి ఆనందం తన కళ్లలో ఇంకా గుర్తుందని తెలిపారు. ప్రస్తుతం కళాకారులు చేస్తున్న నృత్యాన్ని చూస్తుంటే ఆనందభాష్పాలు వస్తున్నాయన్నారు. కోలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. కుంభాభిషేకం


కలశాలను తీసుకు వస్తున్న వేద పండితులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో శ్రీసర్వ మంగళాదేవి సమేత శ్రీపళ్లికొండేశ్వరాలయ కుంభాభిషేకాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముడుచ్చురు ఆగమ పాఠశాల ప్రిన్సిపల్ షణ్ముఖసుందరం ఆధ్వర్యంలో హోమాలు. పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బాలాజీరెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ కమలాకర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వాదం చేసి, జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. 12వ అడిషనల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని డైనమిక్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఎస్ఐ ప్రతాప్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. తమ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతామన్నారు. సంస్థ ప్రతినిధులు బొప్పన శ్రీనివాసులు, నాగప్రసాద్, రామసుబ్బయ్య, ప్రభాకర్, గోపి, మహ్మద్, మోహనరావు పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్రా జిల్లా పోటీలకు సత్యవేడు జట్టు


విజేతగా నిలిచిన సత్యవేడు జట్టు క్రీడాకారులు

సత్యవేడు: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన ఆడుదాం-ఆంధ్ర నియోజవర్గస్థాయి క్రికెట్ పోటీల విజేతగా సత్యవేడు జట్టు నిలిచింది. సత్యవేడు- కేవీబీపురం జట్లు మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కేవీబీపురం జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 62 పరుగులు చేసింది. అనంతరం బ్యాంటింగ్‌కు దిగిన సత్యవేడు జట్టు 7వ ఓవర్లలో 67 పరుగులు సాధించి విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. అంపైర్లుగా పీడీలు మురళి, నాగరాజు, సతీష్, మణి వ్యవహరించారు.

అవార్డుకు ఎంపిక


సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు మద్దిల సుబ్రమణ్యం సుభాష్‌చంద్రబోస్ మెమోరియల్ అవార్డు (వర్చువల్ పద్ధతిలో)కు ఎంపికయ్యారు. వివిధ రంగాల్లో అందించిన ఉత్తమ సేవలను గుర్తించి తనను అవార్డుకు ఎంపిక చేసినట్లు ఉత్తరప్రదేశ్ సహారా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అఖ్లాక్ అహమ్మద్ నుంచి ఆదివారం సమాచారం అందినట్లు సుబ్రమణ్యం తెలిపారు.

సేవారత్న పురస్కారం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తికి చెందిన యువతరం సేవా సమితి స్వచ్ఛంధ సంస్థకు భారత సేవారత్న పురస్కారం లభించింది. విశాఖపట్టణంలో ఆదివారం సంస్థ సభ్యులు పురస్కారం అందుకున్నారు. విశాఖపట్టణంకు చెందిన తాసుబెల్లి ఫౌండేషన్ 25వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వాహకుడు శంకర్‌నాయుడు పురస్కారం అందజేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం బీడీకాలనీ వద్ద ఆదివారం మద్యం స్వాధీనం చేసుకుని, వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం.. బీడీకాలనీకి చెందిన వెంకటేష్ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడు వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు.

సీఎం జగన్ దార్శనికతకు ఫిదా


సత్యవేడు హైస్కూల్‌లో ఆదివారం ఒక్కటైన 1980-81 టెన్త్ విద్యార్థులు

సత్యవేడు: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1980-81 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. దేశ, విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డ పూర్వవిద్యార్థులందరూ ఒకే వేదికపైకి చేరుకున్నారు. తాము విద్యా భ్యాసం చేసిన పాఠశాల.. తరగతి గదులను పరిశీలించి పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వం కల్పించిన ఆధునిక వసతులను వీక్షించి ప్రశంసలు కురిపించారు. పిల్లలకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతను కొనియాడారు. అనంతరం ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు విచారించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకుని ఆనందపరవశులయ్యారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువు చిన్ననారాయణరెడ్డిని సత్కరించి పాదాభివందనం చేశారు. పూర్వ విద్యార్థులు డీవీ రాజు, పి.త్రివిక్రమ్‌రావు, జయచంద్రుడు, కృష్ణంరాజు, రాంబాబు, సురేంద్ర, అరుంధతి, అరుణ, స్వరూప, అనూరాధ, జయంతి, ప్రకాష్, మోహన్‌రావు, రఫీ, రవి పాల్గొన్నారు.